క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన కంప మల్ల నాగభూషణంరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తెలు వందన, భావన కుటుంబ సభ్యులు రూ.25 వేల విరాళం ఇచ్చారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ఆలయ అర్చకులకు విరాళం అందజేశారు. దాతలకు దుశ్శాలువా కప్పి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం నేతలు

సంజామల: వివిధ శాఖల్లో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని దివ్యాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంజామల ఎంపీడీఓ సాల్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. వీటన్నింటికీ నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులతో అక్టోబర్ 10వ తేదీ నంద్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఆయనతో పాటు దివ్యాంగులు ఇస్మాయిల్, చెన్నయ్య, ప్రసాదు, నిజాము, ఉస్సేని గౌడు, చంద్రయ్య ఉన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో నివాసం ఉంటున్న యనకండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బల రాజశేఖర్‌రెడ్డి తల్లి బొబ్బల రాజమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

సమాజాభివృద్ధే లక్ష్యం

కొలిమిగుండ్ల: ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సేవా ప్రముఖ్ మనోహర్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కొలిమిగుండ్లలోని అయ్యప్పస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక సమరసత కలిగి ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్న ఇతరులకు సాయం అందించి ముందుకు నడిపించాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, శ్రీనివాసులు, జయరాముడు యాదవ్, మహేష్‌స్వామి, లక్ష్మీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

దసరా వేడుకల్లో అపశృతి

ప్యాపిలి: మండల కేంద్రంలో గురువారం జరిగిన దసరా వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. అయితే గురువారం జరిగిన వేడుకలను తన ఇంటి వద్ద నిల్చుని తిలకిస్తున్న మలిగె ఖాజా హుసేన్‌పైకి ఓ ట్రాక్టర్ అతి వేగంతో దూసుకొచ్చింది. దీంతో ఖాజా హుసేన్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

8 నుంచి ఆధార్ క్యాంప్

డోన్: జాతీయ తపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు డోన్ పోస్టాఫీసులో ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జయకృష్ణ తెలిపారు. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు, తప్పులు సరిదిద్దడం, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టిమిద్దె కూలి మహిళకు గాయాలు

బేతంచెర్ల: ఇటీవల కురిసిన వర్షాలకు బయటిపేట కాలనీలోని ఒక మట్టిమిద్దె శుక్రవారం కూలిపోయింది. అందులో నివాసం ఉంటున్న మాబూబీకి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న అంజాద్‌బాషా స్థానికుల సహాయంతో ఇంట్లో ఇరుక్కుపోయిన ఆమెను రక్షించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని వస్తువులు, సరుకులు దెబ్బతిన్నాయి. తనకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.






పేరుసోములలో గ్రామోత్సవం, రహిమానుపురంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మారెమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం, బేతంచెర్ల అమ్మవారిశాలలో విజయదుర్గ అలంకారం

జగన్మాత.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. వివిధ గ్రామాల్లో కొలువైన అమ్మవార్లు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల కొలువుంచిన అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులు రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. –సాక్షి నెట్‌వర్క్




డోన్ అమ్మవారిశాలలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత




సింహవాహనంపై నందవరం చౌడేశ్వరిదేవి, బేతంచెర్లలో రంగులు చల్లుకుంటున్న ఆర్యవైశ్యులు



పాతబస్టాండ్‌లోని దుర్గమ్మ



ఆర్‌ఎస్ రంగాపురంలో ఎల్లమ్మ



కోవెలకుంట్లలో వాసవీమాత ఊరేగింపు

నేడు గిద్దలూరులో వైఎస్సార్‌సీపీ సమావేశం

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు ఫంక్షన్ హాల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రచార విభాగం జిల్లా కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన సమాశం జరుగుతుందని చెప్పారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రేపు కొలిమిగుండ్లలో సమావేశం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

డోన్‌లో యోగా శిక్షణ తరగతులు

డోన్ టౌన్: శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపయోగకరమైన ధ్యానం, ప్రాణాయామం తదితర అంశాలపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యోగా గురూజీ సుధాకర్ శిక్షణ ఇవ్వనున్నట్లు డోన్ యోగాసన సంఘం సభ్యులు తెలిపారు. పరిచయ కార్యక్రమం శనివారం సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న క్లబ్ హౌస్‌లో ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తా



చల్లా విఘ్నేశ్వరరెడ్డి

అవుకు (కొలిమిగుండ్ల): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనను తొలిసారిగా పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించడంతో సంతోషంగా ఉందని, ఇకపై ప్రజలకు, పార్టీకి అనుసంధాన కర్తగా పనిచేస్తానని చల్లా విఘ్నేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని చల్లా ఫాంహౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనపై కేసులు పెట్టి ఇబ్బందులు సృష్టించినా వెనకడుగు వేయలేదన్నారు. అధిష్టానం తన కృషిని గుర్తించి ఈ అవకాశం ఇచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. పదవిని అలంకారప్రాయంగా కాకుండా పూర్తి స్థాయిలో బాధ్యతగా తీసుకొని, ప్రజలతో కలిసిమెలిసి పార్టీ బలోపేతం చేయడమే ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఇతర పార్టీ నాయకులతో చర్చించి అవుకులో భారీ సభ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం దీపావళి నాటికి అన్ని వసతులతో సిద్ధమవుతుందని పేర్కొన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. తన నియామకానికి కారకులైన పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన తండ్రి, మాజీ ఎమ్మెల్సీ దివంగత చల్లా రామకృష్ణారెడ్డి ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.

గరుడ వాహనంపై నృసింహుడు



శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: దసరా శరన్నవరాత్రుల్లో చివరి రోజు గురువారం మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి యాగం, సహస్ర దీపాలంకరణ, మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగిశాయి. సాయంత్రం విజయదశమి సందర్భంగా ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామిని గరుడవాహనంపై ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ వీధుల మీదుగా ఊరేగింపు చేశారు. మేళతాళాలు, భక్తుల నరసింహనామ స్మరణల మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. ముందుగా గ్రామంలోని శమీవృక్షం వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రిష్ణానగర్‌కు మంచినీటి సౌకర్యం



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్

డోన్: కొద్ది రోజులుగా మంచి నీటి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న క్రిష్ణానగర్ వాసుల కలలు నేటితో ఫలించాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం క్రిష్ణానగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన పైప్‌లైన్ పనులను డీఈఈ రఘు, ఏఈ సురేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, వైఎస్సార్‌సీపీ నేత వంశీతో కలిసి ఆయన పరిశీలించారు. మంచి నీటి కొళాయి అవసరమైన వారు చలానా చెల్లించిన వెంటనే కనెక్షన్ మంజూరు చేస్తామని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



శేఖర్(ఫైల్)

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని అన్నవరంలో నట్ల శేఖర్ (42) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఇతనికి గ్రామంలో ఓ వ్యక్తితో గొడవలు ఉండేవి. దీంతో కొద్ది రోజుల నుంచి బనగానపల్లెలో ఉంటున్నాడు. దసరా కావడంతో అన్నవరానికి వచ్చిన అతను ఊరి సమీపంలోని కాల్వలో శుక్రవారం శవమై కనిపించాడు. కుక్కలు అరుస్తుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాల్వలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడని ప్రాథమికంగా పేర్కొన్నారు. కేసు విచారిస్తున్నట్లు తెలిపారు. వివాహేతర సంబంధం వల్లే హత్య జరిగిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: మండలంలోని యు.కొత్తపల్లె సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మల్యాల, దేవరబండ, గుండాల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ నాగేంద్ర తెలిపారు. ఇండస్ట్రీస్‌కు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 10 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు.

- కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నందిపాడు ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌ఇంజినీర్ లక్ష్మణస్వామి తెలిపారు. గృహాలకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపడుతున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

శివవరంలో అగ్నిప్రమాదం

- కూలిపోయిన రెండు ఇళ్లు



ప్రమాద తీవ్రతకు కూలిపోయిన ఇల్లు

అవుకు(కొలిమిగుండ్ల): మండలంలోని శివవరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద సమయంలో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, పుల్లారెడ్డిలకు చెందిన ఇళ్లు పక్క పక్కనే ఉన్నాయి. దసరా పండుగ కావడంతో ఇళ్లలో పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఇరు కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. గోవిందరెడ్డి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా గ్యాస్ సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న పుల్లారెడ్డి ఇల్లు దెబ్బతింది. మంటల వ్యాప్తి చెందడంతో ఇళ్లలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. మంటల ధాటికి నిల్వ ఉంచుకున్న ధాన్యం, బీరువాలో దాచుకున్న డబ్బు, బంగారు ఆభరణాలు కాలిపోయాయి. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. చుట్టుపక్కల నివాసాల ప్రజలు బనగానపల్లె అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే నష్టం జరిగిపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు.



కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



డోన్: నివాళులర్పిస్తున్న ఆవోపా సభ్యులు



బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాయలంలో..

బాపు మార్గం అనుసరణీయం

- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, వివిధ సంఘాల నేతలు



గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సీఐ



బేతంచెర్ల నగర పంచాయతీ సిబ్బందిని సత్కరించిన కమిషనర్

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ అహింసా మార్గం అనుసరణీయం అని.. ప్రతి ఒక్కరూ జాతిపిత ఆశయ సాధనకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గురువారం గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని అమ్మవారిశాల ఆవరణలో ఉన్న బాపు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓ ప్రకాష్‌నాయుడు గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ అహింసా మార్గాన్ని ఎంచుకుని దేశానికి స్వాతంత్య్రం సిద్ధింపజేశారన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు శివనాగయ్య, అభిలాష్, నాగరాజు, చంద్రశేఖర్, ఆర్‌ఐ లక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

- డోన్ టౌన్: స్థానిక పాతబస్టాండ్‌లోని గాంధీజీ విగ్రహానికి పలు ప్రజా సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో పాటు స్వచ్ఛంద సంస్థ సభ్యులు నివాళులర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీ పాత్ర.. ఆయన త్యాగాలు, సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం అని పేర్కొన్నారు.
- రిమాండ్ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా సూచించారు. స్థానిక సబ్ జైలులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ అహింసా మార్గం ద్వారానే దేశానికి స్వాతంత్య్రం లభించిందని గుర్తు చేశారు. క్షణికావేశంలో చేసిన తప్పుల కారణంగా జైలు శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన నేర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మళ్లీ తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలన్నారు.
- బేతంచెర్ల: శాంతి అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఈఓఆర్డీ మల్లికార్జున, సూపరింటెండెంట్ దస్తగిరిబాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వార్డు కౌన్సెలర్లు బాపు చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు.

సంక్షిప్తం

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య



జ్యోతి (ఫైల్)

బేతంచెర్ల: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని దుర్గాపేట కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ బాబు వివరాల మేరకు.. కాలనీకి చెందిన ముద్దవరం నాగతిమ్మయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె ముద్దవరం జ్యోతి(19)ని కృష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ అలియాస్ రాజుకు ఇచ్చి ఏడాది క్రితం వివాహం చేశారు. కొద్ది రోజులుగా భర్త వేధింపులకు పాల్పడుతున్నాడు. మనస్తాపం చెందిన జ్యోతి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు భర్త ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్: ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు శుక్రవారం ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో అనాథ శవం పడి ఉన్న విషయాన్ని పట్టణ పోలీసులు సేవా సమితి సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సమితి సభ్యులకు అప్పగించారు. ప్రొద్దుటూరుకు చెందిన చరణ్‌తేజారెడ్డి ఆర్థిక సహాయంతో హిందూ సంప్రదాయం ప్రకారం స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. సభ్యులు షాదీఖానారాజు, తాహెర్ బాషా, కేరళ రఫీ, జాకీర్, షబ్బీర్, బాబా, హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు పాల్గొన్నారు.

లైఫ్ సంస్థకు బాడీ ఫ్రీజర్ విరాళం



ఫ్రీజర్ బాక్స్‌ను అందిస్తున్న దాతలు

బేతంచెర్ల: పట్టణంలో సమాజ సేవ చేస్తున్న లైఫ్ సంస్థకు దాతల ఆర్థిక సాయంతో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రూ.80 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వీరారెడ్డి, కార్యదర్శి సంజీవరాయుడు, దాతలు రంగారెడ్డి, మధుసూదనరెడ్డి, రామిరెడ్డి, పెద్దయ్య, రాజశేఖర్,మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.